నాన్నగారి కోటు గుండీలు కుట్టో, చెల్లెలికి లేసులు అల్లిపెట్టో — యిలాంటి పనులలో నిమగ్నురాలై ఉండిపోయేది. ఎవరికైనా యింట్లో జ్వరంవస్తే చాలు, ఆదింక నిద్రాహారాలు మాని అక్కడే కూర్చుండిపోయేది.

సుభద్ర అనాకారి కాదుగాని అందమయింది కూడా కాదు. ఉన్న కళ్ళు చిన్నవే అయినా వాటిలో చిత్రమయిన మెరుపు ఉండేది. ఎత్తయిన బుగ్గలూ, లావుగాఉన్న పెదవులూ ఆమెకు వికృతాన్ని అంటగడుతున్నా, మెరుస్తున్న కళ్ళూ, విశాలమయిన నుదురూ — వీటినిమించి వయస్సుతో వచ్చిన సొగసూ — యివి ఆమె అనాకారితనాన్ని కప్పిపుచ్చేవి. ఇంతకన్న అనేకవిధాల విశాల లక్షణలక్షితంగా, ఆకర్షణీయంగా ఉండేది.

స్వతహాగా తగినంత ఆదుర్దా లేకపోయినా, యిరుగుపొరుగుల సూటిపోటి మాటలు పడలేక ఒకనాడు మొగుణ్ని కాస్త గట్టిగానే కదిపి చూసింది వరలక్ష్మి.

'ఏమండీ, విశాలకి పదహారు వెళ్ళిపోయాయి. పెద్దదాని మాట సరే, పద్దెనిమిది దాటేయి. ఈ వయసుకి నే నిద్దరుబిడ్డల తల్లినయ్యాను. ఇంట్లో పెళ్ళికెదిగిన పిల్ల కంట్లో రాళ్ళలా బాధిస్తూంటే మీకు చీమకుట్టినట్టయినా లేదు. పిల్లలకి పెళ్ళిళ్లు ఎప్పుడవుతాయో, ఆ వినాయకుడికి దయెప్పుడు కలుగుతుంతో !'

'వినాయకుడికి కలిగేం లాభం, వియ్యంకుడికి కలగాలి గాని !'

'చస్తూంటే సరసం ! ఇద్దరికీ ఒకసారి చెయ్యడమంటే...'

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. విశాల కేం అదే అవుతుంది — ముందు యీ సుభద్రకి అయిందనిపిస్తే...అయినా నేను మాత్రం కూర్చున్నానా లక్ష్మీ ? చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను !' అన్నారు రంగనాధంగారు. ఆరోజు మొదలు ఆయన మరింత శ్రద్ధతో పనిచేసేవారు. ఎక్కడెక్కడి సంబంధాలూ గాలించేవారు. ఇంకా ఆయన ప్రయత్నాలు అలా ఉండగానే

'ఆపేశావేం, చెప్పు?'

'మరేంలేదు. ట్రైనింగుకాలేజి చాలాదూరం. మనింటికి మూడు మైళ్ళ యినా ఉంటుంది. ఎలాగా అని ఆలోచిస్తున్నాను'

'పొద్దుటే భోంచేసి నడిచి వెళ్ళిపో...సాయంకాలం రా'

'మరి యిది? ఇంకా ఏణ్ణర్థమయినా లేదే. నన్ను విడిచి ఉండగలదా ?'

'నేను ఉన్నానుగా? దాన్ని ఆడించే పూచీ నాదీ' సుభద్ర మనస్సుకి వెయ్యి ఏనుగుల బలం వచ్చేసింది. ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళుతిరిగి నారాయణ పాదాలమీద పడ్డాయి.

'మీకు చదువులేదు ... కాని హృదయముంది' అంది ఆమె అప్రయత్నంగా.

ఆరాత్రే భోజనాలదగ్గిర వరలక్ష్మి ప్రస్తావన తీసుకొచ్చింది.

'విన్నారా? ఇది ట్రైనింగుకూడా చదువుతుందిట'

'చదవనీ — మనకేం?'

'అంతలో ఉందన్నమాట మీ తెలివి. ఎంత పట్టించుకోకుండా ఏడు కొండలవాణ్ణి తలుచుకుందామనుకున్నా, యిరుగూ పొరుగూ యిప్పటికే పనీపాటా లేనివాణ్ణి తెచ్చి యింట్లో కూర్చోపెట్టుకున్నామని దూదేకినట్టు ఏకేస్తున్నారు. ఇక యీవిడగారు ఉద్యోగంకూడా వెలిగిస్తే — అతనికి సిగ్గులేకపోతే పోతేగాని — వాళ్ళని ఉంచుకోటానికి మనకేనా అభిమానం ఉండొద్దుటండీ?'

'నీ తెలివితేటలకి సంతోషించాంగాని, దానికే నిజంగా ఉద్యోగమైతే వాళ్ళిక్కడెందుకుంటాయి ? అప్పుడు మనం పంపేశామని లోకనింద ఉండదుగా ?'

'అవును నిజమే. నే అంతమట్టుకు ఆలోచించలేదు. అవునుగాని పద్దెనిమిదికూడా వెళ్ళిపోతాయి, ఆ విశాలకైనా మంచి సంబంధం చూడ

